ఘనంగా బేటీ జన్మోత్సవ్

జనరల్ ఆస్పత్రిలో బేటీ జన్మోత్సవ వేడుకలను నిర్వహిస్తున్న డీడబ్ల్యూఓ వెంకటరమణ

వెంకటరమణ అన్నారు. సోమవారం జనరల్ ఆస్పత్రిలో మహిళా సాధికార కేంద్రం ఆధ్వర్యంలో బేటీ జన్మోత్సవ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం అయిన ఆడబిడ్డలకు బేటీ జన్మోత్సవ్ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో ఆర్డినేట్ చైతన్య, జెండర్ స్పెషలిస్ట్ రేవతి వినోద, తేజస్వీని, క్రాంతి పాల్గొన్నారు.

హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన

బూరుగడ్డలో ఆరోగ్య ఉప కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 11 : పేదలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని బూరుగడ్డ, మాచవరం గ్రామాలకు రూ.20 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నూతన ఆరోగ్య ఉప కేంద్రాలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహాయంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు నిధులు మంజూరు చేసిన మంత్రి ఉత్తమ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్, మండల వైద్యాధికారి పుష్పాలత, ఎస్ఐ ముత్తయ్య పాల్గొన్నారు.

నీటి ఎద్దడికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

బోరు పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వర్లు

● ఎంపీపీ వెంకటేశ్వర్లు

అనంతగిరి, మార్చి 11 : వేసవిలో నీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీపీ చుండూరు వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో మినరల్ ఫండ్ నిధులతో బోరు పనులు ప్రారంభించి మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సహకారంతో మండల వ్యాప్తంగా బోర్ల ఏర్పాటుకు రూ.9.60 లక్షలు మంజూరు అయినట్లు చెప్పారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బోర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అజ్మత్ అలీ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని ఎంపీడీఓకు వినతి

మేళ్లచెర్వు : మండలంలోని హేమ్లాతండాలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చాలని కోరుతూ పలువురు గ్రామస్తులు ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీకి వినతిపత్రం అందించారు. బోరుబావుల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు మిషన్ భగీరథ పైపులు పగిలి నల్లాల్లో మురుగునీరు వస్తున్నదని వారు ఈ సందర్భంగా ఎంపీడీఓ దృష్టికి తీసుకువచ్చారు. కొత్త బోర్లు వేసే లోగా ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని వారు కోరారు.

ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు అందించాలి

● టీఎంహెచ్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు లింగయ్య

నియామక పత్రం అందజేస్తున్న టీఎంహెచ్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు లింగయ్య

నేరేడుచర్ల, మార్చి 11 : కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి దళిత కుటుంబానికి రూ.12 లక్షలు దళితబంధు రూపంలో అందించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు మొండి కత్తి లింగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నేరేడుచర్లలో నిర్వహించిన సంఘం నియోజకవర్గ స్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ చేపట్టి చట్టబద్ధత కల్పించాలన్నారు. వీఓఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి ప్రతి నెలా రూ.20 వేలు జీతం అందజేయాలన్నారు. లేదంటే త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జీలుగా మచ్చ శ్రీనివాస్, ఇంజమూరి వెంకటేశ్వర్లును, హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాపోలు వెంకటేశ్వర్లును నియమిస్తూ నియామక ప్రతం అందజేశారు.

నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌కు చేరిన పదో తరగతి ప్రశ్నాపత్రాలు

పోలీస్ స్టేషన్‌కు చేరిన పదో తరగతి ప్రశ్నాపత్రాలు

నేరేడుచర్ల, మార్చి 11 : ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరుగనున్న పదో తరగతి వార్షిక పరీక్షల ప్రశ్నా పత్రాలు సోమవారం నేరేడుచర్ల పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ఎస్ఎస్సీ బోర్డు నుంచి వచ్చిన రెండు సెట్ల ప్రశ్నా పత్రాలను ఎంఈఓ చత్రు నాయక్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరేడుచర్ల, పాలకవీడు మండలాల్లోని 19 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 645 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కానున్నట్లు తెలిపారు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్, శ్రీవాణి, ప్రగతి పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ హర్షనీయం

● టీఎస్ యూటీఎఫ్ నాయకులు

తిరుమలగిరి, మార్చి 11 : ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు ఉచిత విద్యుత్ కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షనీయమని టీఎస్ యూటీఎఫ్ మండల, జిల్లా కార్యదర్శి చల్లగుండ్ల సోమన్న, వి.ఎల్.ఎన్ చార్యులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. పాఠశాలల్లో సర్వీస్ పర్సన్స్‌ను నియమిస్తామని అలాగే 2008 డీఎస్సీ, బీఈడీ అభ్యర్థుల ఉద్యోగాలపై 12న జరిగే క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామని సీఎం ప్రకటించడం, ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇవ్వడం స్వాగతించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజయ్య, మహేశ్, వెంకటయ్య పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

గ్రీవెన్స్ ఫిర్యాదులు పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, మార్చి 11 : జిల్లాలో భూ సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో 41 దరఖాస్తులు రాగా 25 దరఖాస్తులు భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చినట్లు తెలిపారు. వేసవి దృష్ట్యా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేస్తూ నర్సరీల్లోని మొక్కలు, నాటిన మొక్కలు ఎండిపోకుండా నిరంతరం వాటరింగ్ చేయించాలన్నారు. పశువుల కోసం నీటి తొట్లలో నీటిని నింపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్‌డీఓ మధుసూదన్‌రాజు, డీఏఫ్ఓ సతీశ్‌కుమార్, డీఈఓ అశోక్, డీపీఓ సురేశ్‌కుమార్, డీఏఓ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 10 ఫిర్యాదులు

● ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, మార్చి 11 : ప్రతి సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌కు 10 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ రాహుల్ హెగ్డే తెలిపారు. సోమవారం గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి మాట్లాడారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో మాట్లాడుతూ పోలీస్ పరిధిలోని ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడం, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల, అలాగే మహిళలపై జరిగే వేధింపుల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

కుష్టు వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే

నూతనకల్, మార్చి 11 : కుష్టు వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే చేపట్టినట్లు మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. వ్యాధి లక్షణాలు గుర్తించి బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఈ నెల 20వ తేది వరకు రోజూ 20 ఇండ్లను సందర్శించి సర్వే చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ తారమ్మ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలగిరి : కుష్టు వ్యాధి కేసుల నిర్ధారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీహెచ్ఎస్ డాక్టర్ వందన అన్నారు. స్థానిక పీహెచ్ఎస్‌లో ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బిచ్చునాయక్, సూపర్‌వైజర్ స్వరూప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

● చైర్మన్ సత్యనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ

గరిడేపల్లి, మార్చి 11 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా అందజేస్తున్న దీర్ఘ, స్వల్పకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాయినిగూడెం పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు. కీతవారిగూడెం గ్రామంలో గల సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన దీర్ఘ, స్వల్పకాలిక రుణాల అందజేతపై డైరెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ భూమి కలిగి ఉండి సంఘంలో ఓటు లేని రైతులు నూతన ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. సమావేశంలో మాజీ చైర్మన్ ముప్పారపు రామయ్య, డైరెక్టర్లు చెనగాని సాంబయ్య, బానోతు సైదులు, సుకన్య, నర్సమ్మ, రజిత, నాగేశ్వర్‌రావు, కృష్ణ, వెంకటేశ్వర్లు, సీఈఓ కనకయ్య పాల్గొన్నారు.

వెంకన్న మరణం మ్యాథ్స్ ఫోరానికి తీరని లోటు

వెంకన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మ్యాథ్స్ ఉపాధ్యాయులు

● మ్యాథ్స్ ఉపాధ్యాయులు

బొడ్రాయిబజార్, మార్చి 11 : గణిత ఉపాధ్యాయుడు మైలారపు వెంకన్న అకాల మరణం సూర్యాపేట జిల్లా మ్యాథ్స్ ఫోరానికి తీరని లోటు అని జిల్లా సెక్టోరియల్ అధికారి కె.శ్రావణ్‌కుమార్, పరీక్షల విభాగం ఇన్‌చార్జి శ్రీనయ్య అన్నారు. పెన్‌పహాడ్ జడ్పీహెచ్ఎస్ గణిత ఉపాధ్యాయుడు మైలారపు వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా సోమవారం స్థానిక పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో జిల్లా మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో వారు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మ్యాథ్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మందాడి అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ ఎన్.రవి, తెలంగాణ రాష్ట్ర మ్యాథ్స్ ఫోరం అధ్యక్షుడు కె.శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు సతీశ్, తెలంగాణ మ్యాథ్స్ ఫోరం నాయకులు డి.కోటేశ్వర్‌రావు, జి.వెంకటేశ్వర్లు, తంగెళ్ల జితేందర్‌రెడ్డి, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

14న జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

● రైతు సంఘాల నాయకులు

విలేకరుల మాట్లాడుతున్న రైతు సంఘాల నాయకులు

బొడ్రాయిబజార్, మార్చి 11 : దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న రైతు ఉద్యమానికి మద్దతుగా ఈ నెల 14న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్యభవన్ సెంటర్‌లో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘాల నాయకులు కోరారు. సోమవారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఏర్పాటు చేసిన సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా కమిటీ సమావేశంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండ వెంకట్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి దొడ్డ వెంకటయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు మాట్లాడారు. రైతాంగానికి మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని, విద్యుత్ సవరణ బిల్లులను వెనక్కు తీసుకోవాలన్నారు. సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఇఫ్టూ నాయకులు కునుకుంట్ల సైదులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

● ఎస్ఐ బాలకృష్ణ

సూర్యాపేట సిటీ, మార్చి 11 : విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూర్యాపేట పట్టణ ఎస్ఐ బాలకృష్ణ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ వాణి జ్యోత్స్న అన్నారు. విద్యార్థుల్లోని సృతజనాత్మకతను వెలికితీసేలా ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించడం అభినందనీయమన్నారు. సోమవారం స్థానిక ప్రబుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు బహుమతులు ప్రాదానం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అక్కినపల్లి వినయ్, కంపసాటి విష్ణు, విజయలక్ష్మి, వినయ్, అరుణ్, సాయి, పృద్వీ, వేణు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

నాగారం, మార్చి 11 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. సోమవారం ఫణిగిరి గ్రామంలో రెండో భద్రాద్రిగా కొలువైన సీతారామచంద్రస్వామి దేవాలయ ధర్మకర్తల ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ గట్టు లక్ష్మీనర్సింహారావు, వైస్ చైర్మన్ కల్లట్లపల్లి సోమయ్య, ధర్మకర్తలు ఆకుల శంకరయ్య, దాసరి నాగమణి, వేముల యాదగిరి, మామిడి భిక్షం, జంపాల రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తులు

సూర్యాపేట అర్బన్, మార్చి 11 : ఉపాధ్యాయ నియామకాలు (డీఎస్సీ) ఉచిత శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ సీహెచ్.రాములు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 వరకు ఆన్‌లైన్ ద్వారా షెడ్యూల్ కులాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 2 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందించడం జరుగుతుందని వెల్లడించారు. డైట్, బీఈడీతో పాటు టెట్ అర్హత సాధించిన వారు అర్హులనన్నారు. అభ్యర్థులు tsstudycircle.co.in నందు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9989129935 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

చిలుకూరు గ్రంథాలయ చైర్మన్‌గా శేషగిరిరావు

చిలుకూరు, మార్చి 11 : చిలుకూరు బాపూజీ శాఖా గ్రంథాలయ నూతన చైర్మన్‌గా గ్రామానికి చెందిన గరిణె శేషగిరిరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ఎమ్మెల్యే పద్మావతికి కృతజ్ఞతలు తెలిపారు.

పరీక్షా సామగ్రి పంపిణీ

చిలుకూరు, మార్చి 11 : మునగాలలోని జడ్పీహెచ్ఎస్ పదో తరగతి విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయులు ఎస్కే జానిమియా, ఉషా సోమవారం పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం సీతారామరాజు, ఉపాధ్యాయులు అబ్దుల్‌సత్తార్, ఫాతిమాబేగం, గోపర్ధన్, జ్యోతి, పద్మ పాల్గొన్నారు.

పాలాల్లో విద్యుత్ తీగల ఇబ్బందులు తెలుపాలి

● ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్

నేరేడుచర్ల, మార్చి 11 : వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్ తీగల విషయంలో ఇబ్బందులు ఉన్న రైతులు తక్షణమే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందివ్వాలని ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట కోతలు మొదలైన నేపథ్యంలో పొలాల్లో కరెంటు లైన్లు కిందకు ఉన్నట్లయితే వరి కోత మిషన్లకు తగిలే ప్రమాదం ఉన్నందున తక్షణమే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

సైబిరెడ్డి పార్టీని వీడినా బీఆర్ఎస్‌కు నష్టం లేదు

● పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య

మేళ్లచెర్వు, మార్చి 11 : హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి బీజేపీలో చేరినా బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదని ఆ పార్టీ మండలాధ్యక్షుడు సూరిశెట్టి బసవయ్య అన్నారు. మండల పరిధిలోని రామాపురం గ్రామంలో మాజీ ఎంపీపీ పాలేటి రామారావుతో కలిసి సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి పని చేస్తామన్నారు. ఆయన వెంట పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొట్టె నరసింహారావు ఉన్నారు.

వైభవంగా కొనసాగుతున్న మేళ్లచెర్వు జాతర

● ముగిసిన సౌర మహాయాగం
● జోరుగా ఎడ్ల పందేలు
● ఉత్సాహంగా కబడ్డీ పోటీలు

ఆదివారం రాత్రి జరిగిన ఆరుపళ్ల విభాగంలో ప్రథమ బహుమతి గెలుచుకున్న ఎద్దులు

మేళ్లచెర్వు, ఫిబ్రవరి 11 : మహా శివరాత్రి జాతరను పురస్కరించుకుని స్థానిక స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం నాలుగో రోజు ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా శివుడికి మహా న్యాస రుద్రాభిషేకం, రుద్రహోమం, అర్చనలు, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో అన్నదానం చేశారు. దుకాణాలు, పిల్లల వినోద యంత్రాల వద్ద సందడి కొనసాగింది.

ముగిసిన సౌర మహాయాగం

విశ్వశాంతి కోసం స్థానిక భూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో నెల రోజులుగా కొనసాగుతున్న సౌర మహాయాగం సోమవారం పూర్ణాహుతితో ముగిసింది. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు, యంత్ర పూజలను అర్చకులు కొంకపాక రాధాకృష్ణమూర్తి, యాతవాకిళ్ల భానుకిరణ్‌శర్మ వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జోరుగా ఎడ్ల పందేలు, కబడ్డీ పోటీలు

జాతరలో ఎడ్ల పందేలు, కబడ్డీ పోటీలు జోరుగా కొనసాగుతున్నాయి. సోమవారం మధ్యాహ్నం వరకు సబ్ జూనియర్స్ విభాగంలో పోటీలు జరుగగా అనంతరం జూనియర్స్ విభాగంలో పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. కబడ్డీ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి, ఈఓ కొండారెడ్డి, సభ్యులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, దాతలు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా రమణారెడ్డి

నేరేడుచర్ల, మార్చి 11 : మండలంలోని చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన మలిగిరెడ్డి రమణారెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల సంఘం చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి తొలగించగా జిల్లా సహకార సంఘం ఈ నెల 7న నోటిఫికేషన్ జారీ చేసింది. దాంతో ఎన్నికల అధికారి ఇందిర ఆధ్వర్యంలో చైర్మన్ ఎన్నిక కోసం డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉన్నారు. వారిలో కొండ పిచ్చయ్య మృతి చెందగా మిగిలిన 12 మంది డైరెక్టర్లకు గాను 8 మంది హాజరై చైర్మన్‌గా రమణారెడ్డిని ఏకీగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రాపోలు నర్సయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొణతం చిన్న వెంకట్‌రెడ్డి, సీఈఓ నాగరాజు పాల్గొన్నారు.

సాగర్ కాల్వకు నీటిని విడుదల చేయాలి

● సీపీఐ మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు

గరిడేపల్లి, మార్చి 11 : నాగార్జున సాగర్ ఎడమ కాల్వకు వెంటనే నీటిని విడుదల చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. చివరి వరకు పంటలను కాపాడుకున్న రైతులకు చివరి దశలో పంటలు ఎండుతున్నందున ఆర్థికంగా చాలా నష్టపోవాల్సి వస్తున్నదన్నారు. కావున సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తే పంటలను కాపాడడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పుతాయని పేర్కొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు

హుజూర్‌నగర్, మార్చి 11 : తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన 1969 ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో ని వర్తక సంఘ కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షుడు ముత్తినేని వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమకారులను తెలంగాణ సమరయోధులుగా గుర్తించి గౌరవ భృతితో పాటు, హెల్త్ కార్డులు, 250 గజాల స్థలం, బస్‌పాస్‌లు అందించాలని కోరారు.

ఎస్‌బీఐ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి

● సీపీఎం నాయకులు

బొడ్రాయిబజార్, మార్చి 11 : సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎస్‌బీఐ చైర్మన్‌ను వెంటనే అరెస్ట్ చేసి ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని ఏపూర్ బస్టాండ్ వద్ద గల ఎస్‌బీఐ బ్యాంక్ ముందు ధర్నా నిర్వహించి మాట్లాడారు. కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చినందుకు ప్రతిఫలంగా బీజేపీ వారి నుంచి ఎన్నికల బాండ్ల రూపంలో వేల కోట్ల రూపాయలను పొందినట్లు విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మట్టిపల్లి సైదులు, కోట గోపి,

డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేశ్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మల్సూర్ ఆశయ సాధనకు కృషి చేయాలి : సీపీఐ

బొడ్రాయిబజార్, మార్చి 11 : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కల్లు గీత కార్మిక సం